సాక్షి నాగర్‌కర్నూల్

గురువారం । 26 । అక్టోబర్ । 2023



ఉల్లి ఘాటు

దేవరకద్ర మార్కెట్‌లో నిర్వహించిన వేలంలో ఉల్లి క్వింటాల్ రూ.4,600 ధర పలికింది.

వివరాలు 10లో ▸



ప్రయాణికుల సందడి

దసరా పండుగ ముగిసిన నేపథ్యంలో ప్రజలు పట్టణాలకు తిరుగు ప్రయాణమయ్యారు.

వివరాలు 12లో ▸

గరిష్టం/కనిష్టం
36.4 /13.9

వాతావరణం

రోజంతా ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమవుతుంది. సాయంత్రం చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నిబంధనలు పాటించాలి



అచ్చంపేట రూరల్: అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నిబంధనలు పాటించాలని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. బుధవారం సాయంత్రం ఆయన అచ్చంపేటలో వాహనాల తనిఖీ నిర్వహించారు. అనంతరం గురువారం అచ్చంపేటలో నిర్వహించే సీఎం కేసీఆర్ బహిరంగ సభకు సంబంధించి ట్రాఫిక్ నిబంధనలను పరిశీలించారు. వాహన రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా పోలీసులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలని కోరారు.

దరఖాస్తుల స్వీకరణ

బిజినేపల్లి: వట్టెం నవోదయ విద్యాలయంలో 9, 11వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విద్యాలయ ప్రిన్సిపల్ పి.భాస్కర్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పారామెడికల్ కోర్సుల్లో..

పాలమూరు: మహబూబ్‌నగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాల పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి కి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ రమేష్ బుధవారం ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి డిప్లొమా ఇన్ ల్యాబ్ టెక్నీషియన్ విభాగంలో 30 సీట్లు, డిప్లొమా ఇన్ డయాలసిస్ విభాగంలో 10 సీట్ల భర్తీకి దరఖాస్తులు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్ బైపీసీ ఉత్తీర్ణతయిన విద్యార్థు లు అర్హులని వారు లేకపోతే ఎంపీసీ ఇతర గ్రూప్ విద్యార్థులకు ప్రాధాన్యం ఇస్తామన్నా రు. అర్హత, ఆసక్తిగల విద్యార్థులు నవంబర్ 6లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 13న కౌన్సెలింగ్‌తోపాటు అభ్యర్థుల ఎంపిక ఉంటుందని, 24 నుంచి తరగతులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

మన్యంకొండలో డీఐజీ ప్రత్యేక పూజలు



మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వరస్వామిని బుధవారం జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

గులాబీ ప్రచార భేరి

నేడు అచ్చంపేట, వనపర్తిలో ప్రజా ఆశీర్వాద సభలు



ప్రజా ఆశీర్వాద సభ వేదిక పనులు పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు



- హాజరుకానున్న సీఎం కేసీఆర్
- భారీ జనసమీకరణకు బీఆర్ఎస్ నేతల ప్రయత్నాలు
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి నిరంజన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు

అచ్చంపేట/వనపర్తి: బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల శంఖారావాన్ని పూరించింది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని జడ్చర్లలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభ విజయవంతం కావడంతో.. అదే ఊపులో గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటతో పాటు వనపర్తి జిల్లాకేంద్రంలో భారీ బహిరంగసభలు తలపెట్టింది. ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ నిర్వహించే రెండో భారీ ప్రచార సభలు ఇవే కావడం గమనార్హం. అచ్చంపేటలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కేంద్రంగా ఎన్నికల ప్రచారసభలో సీఎం కె.చంద్రశేఖర్‌రావు ప్రసంగించనున్నారు. ఉదయం 11 గంటల జరిగే సభ కోసం ఎనిమిది ఎకరాల స్థలాన్ని సిద్ధం చేశారు. సీఎం కేసీఆర్ హైదరాబాద్ నుంచి నేరుగా అచ్చంపేటకు హెలీకాప్టర్‌లో చేరుకుని ప్రసంగిస్తారు. అనంతరం వనపర్తిలో జరిగే సభలో పాల్గొంటారు. అయితే 2014 నుంచి ఇప్పటి వరకు ప్రతి ఎన్నికల్లో గువ్వల బాలరాజు విజయం కోసం కేసీఆర్ బహిరంగసభ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అలాగే వనపర్తిలోని పాలిటెక్నిక్ కళాశాల క్రీడామైదానంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. హెలీకాప్టర్‌లో మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో జిల్లాకేంద్రానికి చేరుకుంటారు. 2018 ఎన్నికల్లోనూ.. ఇదే మైదానంలో సీఎం కేసీఆర్ ఎన్నికల ప్రచార సభ నిర్వహించారు.

హామీల జల్లు కురిసేనా?

సీఎం కేసీఆర్ అచ్చంపేట సభకు వస్తున్న సందర్భంగా ఈ ప్రాంత ప్రధాన సమస్యలపై సీఎం కేసీఆర్ హామీల జల్లు కురుస్తుందని ఆశిస్తున్నారు. అచ్చంపేట లిఫ్టు–2 మంజూరైనా ఇంకా టెండర్ పూర్తి కాలేదు. 2018 ఎన్నికల సభలో ఎమ్మెల్యే గువ్వల, ఎంపీ రాములు కోరిన కొన్ని హామీలు అలాగే ఉండిపోయాయి. ప్రధానంగా మద్దిమడుగు– మాచర్ల మధ్య కృష్ణానదిపై వంతెన నిర్మాణం, మాచర్ల– గద్వాల రైల్వేలైన్, మెగా లెదర్ పార్కు, ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించేందుకు చిన్న, మధ్య తరహా పరిశ్రమలతోపాటు కాగితపు పరిశ్రమలపై స్పష్టమైన ప్రకటన చేయాలనే డిమాండ్ ఉంది. మహిళా డిగ్రీ కళాశాల, పీజీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలల ఏర్పాటు కోసం ఎదురుస్తున్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పనుల్లో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం, ఆర్ఆర్ఎం ప్యాకేజీ వర్తింపజేయాలనే కోరికలు నెరవేరలేదు.

వనపర్తి జిల్లాకు..

■ 2018 ఎన్నికల ప్రచారంలో భాగంగా పాలిటెక్నిక్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన సభకు సీఎం కేసీఆర్ హాజరై ఇచ్చిన హామీలన్నింటినీ పూర్తి చేశారు. ఈ దఫా జిల్లా అభివృద్ధి కోసం సీఎం జిల్లాకు ఏ వరాలు ఇవ్వనున్నారోనని పార్టీ శ్రేణులతో పాటు జిల్లా ప్రజలు ఆసక్తిగా చూస్తున్నారు. గత ఎన్నికల ఇచ్చిన ప్రభుత్వ మెడికల్, ఇంజనీరింగ్ కళాశాలలు, రోడ్ల విస్తరణ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి.

భారీ బందోబస్తు

అచ్చంపేటలో నిర్వహించే సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు పోలీస్‌లు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే సాయుధ బలగాలు దిగాయి. ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఆధ్వర్యంలో అచ్చంపేట డీఎస్పీ కృష్ణకుమార్, సీఐ అనుదీప్, ఎస్ఐలు గోవర్ధన్, గురుస్వామి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. బందోబస్తులో ఎస్పీతోపాటు నలుగురు ఏఎస్పీలు, 12 మంది డీఎస్పీలు, 16 మంది సీఐలతోపాటు రిజర్వు సీఐలు, 22 మంది ఎస్ఐలు, 312 మంది ఏఎస్ఐలు, కానిస్టేబుళ్లు పాల్గొంటున్నారు.

అంతా గులాబీమయం

సీఎం కేసీఆర్ పాల్గొనే సభ కోసం అచ్చంపేట పట్టణాన్ని గులాబీ జెండాలతో అలంకరించారు. అచ్చంపేట–నాగర్‌కర్నూల్, అచ్చంపేట– లింగాల రోడ్డు, అచ్చంపేట– ఉప్పునుంతల రోడ్డు, అచ్చంపేట– శ్రీశైలం మార్గాల్లో రోడ్డుకు ఇరువైపులా భారీఎత్తున కటౌట్లు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. అచ్చంపేట అంతా గులాబీ జెండాలతో నిండిపోయింది.

■ వనపర్తి మున్సిపాలిటీలోని అన్ని ప్రధాన రహదారులు, ప్రధాన కూడళ్లలో గులాబీ జెండాలు, గులాబీ తోరణాలు కట్టడంతో వనపర్తి గులాబీమయంగా మారిపోయింది. జిల్లాకేంద్రానికి చేరుకునే అన్ని రహదారులు జెండాలు, తోరణాలు, ఫ్లెక్సీలతో నిండిపోయాయి.

సభాస్థలిని పరిశీలించిన ఎస్పీ

సీఎం కేసీఆర్ హాజరుకానున్న సభాస్థలిని ఎస్పీ రక్షితా కె.మూర్తి డీఎస్పీ ఆనంద్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టంగా చేయాలని సూచించారు.

ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి

వనపర్తి జిల్లాకేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన సీఎం ఆశీర్వాద బహిరంగ సభ ఏర్పాట్లను బుధవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డితోపాటు మాజీ ఎమ్మెల్యే, ఇటీవల బీఆర్ఎస్‌లో చేరిన రావుల చంద్రశేఖర్‌రెడ్డి వేర్వేరుగా పరిశీలించారు.

భారీ జనసమీకరణకు ఏర్పాట్లు..

సీఎం కేసీఆర్ పాల్గొనే ప్రజా ఆశీర్వాద బహిరంగ కోసం భారీగా జనాన్ని సమీకరించేందుకు బీఆర్ఎస్ వర్గాలు కృషిచేస్తున్నాయి. ఈ విషయమై ఇప్పటికే గువ్వల బాలరాజు పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. అచ్చంపేట మున్సిపల్ పరిధిలోనే ఎక్కువ మందిని సమీకరించాలని భావిస్తున్నారు. అలాగే అచ్చంపేట, బల్మూర్, లింగాల, అమ్రాబాద్, పదర, వంగూరు, చారకొండ మండలాల నుంచి ఎక్కువ మందిని సమీకరించి సభను విజయవంతం చేయాలని ప్రణాళిక సిద్ధం చేశారు. 2018 నాటి ఎన్నికల ప్రచార సభలా కాకుండా వాహనాల పార్కింగ్, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా కొత్త స్థలాన్ని ఎంపిక చేశారు. నాలుగు చోట్ల వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశారు. వంద మంది వీఐపీలు కూర్చునేందుకు వీలుగా స్టేజీ నిర్మించారు.

■ వనపర్తి నియోజకవర్గంలోని 130 పంచాయతీలు, రెండు మున్సిపాలిటీల నుంచి భారీ ఎత్తున జనసమీకరణ చేసేందుకు బీఆర్ఎస్ పార్టీ ఏర్పాట్లు చేసింది. సుమారుగా 50– 60 వేల మందిని సీఎం ప్రజా ఆశీర్వాద సభలో కూర్చొని ప్రసంగాన్ని వినేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి వెల్లడించారు. గిరిజన తండాలు, గ్రామాలు, మున్సిపాలిటీల వార్డుల నుంచి సభకు ప్రజలను తరలిస్తున్నట్లు చెప్పారు.

పక్కాగా నిఘా..



మంగనూరు చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

- తనిఖీలలో పట్టుబడుతున్న నగదు, మద్యం
- జిల్లా పరిధిలోని ఆరు చెక్‌పోస్టులలో నిరంతర పర్యవేక్షణ
- ఇప్పటికే రూ.1.49 కోట్ల నగదు, 2,632.79 లీటర్ల మద్యం పట్టివేత

నాగర్‌కర్నూల్ క్రైం: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో సందడి మొదలైంది. ఇప్పటికే ప్రధాన రాజకీయ పక్షాలైన బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు ఇంటింటికి వెళ్లి తమ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. అయితే ప్రజలకు రాజకీయ నాయకులు ఎన్నికల హామీలు ఎన్ని ఇచ్చినా.. నగదు, మద్యం పంపిణీ చేయనిదే ఓట్లు పడవని ప్రతిఒక్కరికి తెలిసిన విషయమే. గత ఎన్నికల్లో జిల్లాలో నగదు పంపిణీతోపాటు మద్యం ఏరులైపారింది. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం నిర్వహిస్తున్న అసెంబ్లీ ఎన్నికల్లో మద్యం, నగదు పంపిణీ జరగకుండా ఎన్నికల కమిషన్ సూచనలతో అధికార యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టింది. రాజకీయ పార్టీలు నగదు, మద్యం పంపిణీని అడ్డుకునేందుకు జిల్లా సరిహద్దులతోపాటు ఇతర రాష్ట్రాలకు వెళ్లే సరిహద్దుల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ప్రతిరోజు నిత్యం వాహనాల తనిఖీలు చేపడుతున్నారు.

కేంద్ర బలగాల కవాతు

జిల్లాలో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సమస్యాత్మక ప్రాంతాల్లో ఓటర్లలో నెలకొన్న భయాందోళనలను తొలగించేందుకు సీఐఎస్ఎఫ్ కేంద్ర బలగాల సేవలను వినియోగించుకోనున్నారు. ఓటర్లకు భరోసా కల్పించేందుకు ఇప్పటికే జిల్లాకేంద్రంలో సీఐఎస్ఎఫ్ కేంద్ర బలగాలతో ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. త్వరలోనే అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ నియోజకవర్గాల్లోనూ కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించనున్నారు. ఇప్పటి వరకు కేవలం జిల్లాకు చెందిన పోలీసులను మాత్రమే చెక్‌పోస్టుల తనిఖీల్లో విధులు కేటాయించారు. ఇకపై కేంద్ర బలగాల రాకతో వారి సేవలను చెక్‌పోస్టుల వద్ద వినియోగించుకుని అక్రమ మద్యం, నగదు తరలింపును అడ్డుకోనున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం..

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేయకుండా ఉండేందుకు జిల్లాలో నగదు, మద్యం తరలింపును అడ్డుకునేందుకు 6 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి నిరంతరం వాహనాల తనిఖీ చేస్తున్నాం. ఎవరైనా నగదు, మద్యం ఎన్నికల్లో పంపిణీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించి ఓటర్లకు భరోసా కల్పించడంతోపాటు చెక్‌పోస్టులలో వాహనాల తనిఖీలకు కేంద్ర బలగాలను నియమిస్తాం.

– గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, ఎస్పీ

రూ.50 వేలకు మించి..

రూ.50 వేలకు మించి నగదు తీసుకువెళ్లకూడదనే ఎన్నికల కమిషన్ నిబంధనలు సూచిస్తున్నప్పటికీ కొందరు తెలిసి, మరికొందరు తెలియక అంతకు మించి నగదు తీసుకువెళ్తూ చెక్‌పోస్టుల వద్ద తనిఖీలలో పోలీసులకు దొరికిపోతున్నారు. జిల్లాలోని దోమలపెంట వద్ద ఇంటర్ స్టేట్ చెక్‌పోస్టు, వెల్దండ మండలం కొట్ర, బిజినేపల్లి మండలం మంగనూరు, చారకొండ మండలం మర్రిపల్లి, పెంట్లవెల్లి మండలం జటప్రోల్, ఊర్కొండ వద్ద జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆయా చెక్‌పోస్టుల వద్ద ఇప్పటి వరకు రూ.1,49,82,800 నగదును పోలీసులు స్వాధీనం చేసుకుని ఎన్నికల అధికారులకు అప్పగించారు. అలాగే 2,632.79 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ రూ.14,67,057 ఉంటుందని పోలీసు వర్గాలు వెల్లడించాయి. కాగా ఎన్నికలలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారితోపాటు మద్యం, సారా, బెల్లం విక్రయాలు జరుపుతున్న వాటికి సంబంధించి 164 కేసుల్లో 347 మందిని బైండోవర్ చేసినట్లు వివరించారు.

నేటినుంచి రెండోవిడత యాత్ర


- చేసిన అభివృద్ధి, చేయాల్సిన పనులను ప్రజలకు వివరిస్తా
- ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్: నాగర్‌కర్నూల్ మండలంలోని పుల్జాల నుంచి గురువారం రెండో విడత యాత్ర ప్రారంభిస్తానని, రోజు నాలుగైదు గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుంటానని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పదేళ్లలో చేసిన అభివృద్ధిని వివరించడంతోపాటు ఇంకా చేయాల్సిన పనులను ప్రజలకు వివరిస్తానని చెప్పారు. ఇప్పటికే చాలా పనులకు సంబంధించి అనుమతులు వచ్చాయన్నారు. ఈసారి గెలిస్తే ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలలు, ఐటీ హబ్, పరిశ్రమల స్థాపన లక్ష్యంగా పనిచేస్తానన్నారు. నియోజకవర్గంలో సీనియర్ నేత నాగం జనార్దన్‌రెడ్డి మాత్రమే నాకు ప్రధాన పోటీదారు అన్నారు. తండ్రి ఓ పార్టీ, కొడుకు మరో పార్టీలో ఉండి పూటకో కండువా మార్చే వారు నాకు పోటీ కాదన్నారు. నియోజకవర్గం గురించి తెలియని వాళ్ల గురించి పట్టించుకోనని, కొడుకు కోసం విలువలకు దామోదర్‌రెడ్డి తిలోదకాలు ఇచ్చారని దుయ్యబట్టారు. ఎమ్మెల్సీ పదవి ఇస్తే పోటీ చేయనని గతంలో దామోదర్‌రెడ్డి చెప్పారని గుర్తు చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించిన ప్రజలు ఇప్పుడు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. సబ్బండ వర్గాలకు న్యాయం చేసింది సీఎం కేసీఆర్ మాత్రమేనని, ప్రజలు చాలా తెలివైన వాళ్లని నవంబర్ 30న ఓటుతో మంచి తీర్పు ఇస్తారని ఆశిస్తున్నానన్నారు. సమావేశంలో బీసీసీబీ డైరెక్టర్ రఘునందన్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌యాదవ్, ఎంపీపీలు మధు, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా దుర్గామాత శోభాయాత్ర



పట్టణంలో దుర్గామాతల శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

అచ్చంపేట: పట్టణంలో బుధవారం దుర్గామాత విగ్రహాల శోభాయాత్ర కనులపండువగా నిర్వహించారు. వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయం, భక్త మార్కండేయ ఆలయం, తాలుకా రెడ్డి సేవా సంఘం, వెలమ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారిని పట్టణ ప్రధాన రహదారి గుండా ఊరేగించారు. పదిరోజులపాటు నిర్వహించిన శరన్నరాత్రి ఉత్సవాల అనంతరం జరిగిన తెప్పోత్సవం కార్యక్రమం అత్యంత వైభవంగా జరిపారు. ప్రత్యేకంగా హంసవాహనంపై స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి.. ఆయా ఆలయాల నుంచి కొత్త బస్టాండు, లింగాల రోడ్డు, నెహ్రూచౌరస్తా గుండా ఊరేగించారు. అనంతరం ఉత్తర కోనేరు, నడింపల్లి ఇప్పల చెరువు, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలోని కోనేరులో అవభృత స్నానం (నీటి విహారం) చేయించారు. కార్యక్రమాన్ని తిలకించడానికి భక్తులు, పట్టణ ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక, కోలాటాలు, దాండియా ఆటలు, చెక్క భజనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

జడ్చర్లలో పద్మవ్యూహాన్ని తలపిస్తున్న సమస్య

- ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనదారులు, పాదచారుల నరకయాతన
- బైపాస్, ప్రత్యామ్నాయ మార్గాల అభివృద్ధికి డిమాండ్
- 'సాక్షి' పీపుల్స్ ఎజెండాలో వెల్లడైన ప్రజల అభిప్రాయాలు

ట్రాఫిక్ తిప్పలు తప్పించండి..

నియోజకవర్గ కేంద్రం, మున్సిపాలిటీ అయిన జడ్చర్లలో ట్రాఫిక్ సమస్య ప్రయాణికులు, పట్టణవాసులను వేధిస్తోంది. సెలవు దినాలు మినహాయిస్తే.. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో అటు క్రాస్‌రోడ్డు ఫ్లైఓవర్ వద్ద, ఇటు సిగ్నల్‌గడ్డ అంబేద్కర్, నెహ్రూచౌరస్తాలో ట్రాఫిక్ జాంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ ట్రాఫిక్ పద్మవ్యూహం అనే సమస్య నుంచి ఎప్పుడు విముక్తి లభిస్తుందా అని ఎదురుచూస్తున్నారు.

– జడ్చర్ల టౌన్



167వ నంబరు జాతీయరహదారిపై సిగ్నల్‌గడ్డ వద్ద ట్రాఫిక్ జాం (ఫైల్)

పోలేపల్లిలో ఫార్మసెజ్ ఏర్పాటుతో పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో దినదినాభివృద్ధి చెందుతోంది. దీంతోపాటు 44వ నంబరు జాతీయ రహదారి పట్టణం మీదుగా వెళ్లడం, ప్రస్తుతం రాయచూరు నుంచి కోదాడ వరకు 167వ నంబరు జాతీయ రహదారి నిర్మాణంతో ట్రాఫిక్ సమస్య రెండింతలు అయ్యింది. దీనికితోడు పట్టణంలో సిగ్నల్ గడ్డ వద్ద 750 మీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయి.. ఇటీవలే ప్రారంభం కావడంతో సమస్య జఠిలంగా మారింది. 44వ నంబరు జాతీయ రహదారిపై క్రాస్‌రోడ్డు వద్ద ఫ్లైఓవర్ కింద తరచూ ట్రాఫిక్ జాం ఏర్పడుతుంది. ఇక సిగ్నల్‌గడ్డ వద్ద సమస్య గురించి ఎంత చెప్పినా తక్కువే. పనిదినాల్లో ప్రతిరోజు సాయంత్రం గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతోంది. ఆర్‌యూబీ నిర్మాణంతో పాతబజార్ రైల్వేస్టేషన్ వద్ద, నేతాజీ చౌరస్తా, స్టేషన్‌రోడ్డులో కూరగాయలు, రోడ్డుపైనే వాహనాలు నిలిపి ఉంచడం వల్ల, నేతాజీ విగ్రహం వద్ద ఆటోలు రోడ్డుపై నిలిపి ఉంచటం వల్ల అంబులెన్స్ వెళ్లాలన్నా పదినిమిషాలకు పైగా పడుతుంది. ఇలా ఎటు చూసినా ట్రాఫిక్ సమస్యలతో నియోజకవర్గ కేంద్రం పద్మవ్యూహంలా మారింది. ఈ నేపథ్యంలో బుధవారం 'సాక్షి' నిర్వహించిన పీపుల్స్ ఎజెండాలో ట్రాఫిక్ సమస్యపై పలువురు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

ప్రధాన సమస్య..



పట్టణంలో పరిష్కారం కాని సమస్యల్లో ప్రధానమైనది ట్రాఫిక్. ఎప్పుడు ఏ మార్గంలో వాహనాలు నిలిచిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న జడ్చర్లలో ప్రత్యేక ప్రణాళిక రూపొందించి ట్రాఫిక్ సమస్య నియంత్రించాల్సిన అవసరం ఉంది. అందుకు ప్రత్యామ్నాయ మార్గాలు కల్పించాలి. ప్రజలు, వాహనదారుల్లోనూ అవగాహన పెరిగి నిబంధనలు పాటిస్తే సమస్య కొంత తీరుతుంది.

– యాదగిరి, కవి, రచయిత, రిటైర్డ్ ఉద్యోగి, బాదేపల్లి

సమయాల్లో మార్పు చేయాలి



మినీ ఇండియాగా మారిన జడ్చర్లలో ట్రాఫిక్ సమస్యకు కారణం ప్రైవేట్ స్కూళ్లు, వివిధ కంపెనీల బస్సులు ఒకే సమయంలో పట్టణంలోకి రావడమే. కొన్ని ప్రైవేట్ స్కూళ్లు సమయాల్లో మార్పు చేయడం వల్ల కొంత ట్రాఫిక్ తగ్గే అవకాశం ఉంది. అలాగే ఫార్మ సెజ్ కంపెనీల సమయాల్లోనూ మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. ప్రైవేట్ పార్కింగ్ ఏరియాలు ప్రారంభించి రోడ్లపై వాహనాలు నిలపకుండా చూడాలి.

– తాహెర్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, జడ్చర్ల

నిబంధనలు పాటించకే..



పెరిగిన జనాభాకు అనుగుణంగా కొన్ని రోడ్లు వెడల్పు చేసినా నిబంధనలు కఠినంగా అమలు చేయకపోవడం వల్ల సమస్యలు ఏర్పడుతున్నాయి. 167వ నంబరు జాతీయ రహదారి కోసం మా ఇల్లు స్వచ్ఛందంగా కోల్పోయి స్థలాన్ని ఇచ్చాం. మాకు ఇప్పటి వరకు ఎలాంటి పరిహారం ఇవ్వలేదు. ట్రాఫిక్ సమస్య తీరలేదు. సిగ్నల్స్ ఏర్పాటు చేసి నిబంధనలు పూర్తిగా అమలు చేస్తే సమస్య తీవ్రత తగ్గుతుంది.

– శ్రీనివాసులు, నాయిబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు, జడ్చర్ల

వాకింగ్ ట్రాక్ వేయాలి



సిగ్నల్ గడ్డపై ట్రాఫిక్ జాం అయిన ప్రతిసారి తాలూకా క్లబ్ రోడ్డు ద్వారా 44వ నంబరు జాతీయ రహదారికి వాహనాలు వెళ్తున్నాయి. నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాలు వెళ్లడం వల్ల స్కూల్ విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మార్గంలో పదికిపైగా స్కూళ్లు ఉన్నాయి. వాకింగ్ ట్రాక్ వేస్తే కొంత వరకు ట్రాఫిక్ సమస్య తీరుతుంది.

– రాధాకృష్ణ, సామాజికవేత్త, బాదేపల్లి

క్లుప్తంగా

గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం



ఆత్మకూర్: దసరా సెలవులకు కుటుంబసభ్యులతో సరదాగా గడుపేందుకు వచ్చిన యువకుడు జూరాల ప్రధాన ఎడుమ కాల్వలో గల్లంతై కనిపించకుండా పోయిన ఘటనలో బుధవారం శవం లభ్యమైంది. ఏఎస్ఐ బీచుపల్లి తెలిపిన వివరాల ప్రకారం.. అమరచింతకు చెందిన గాజుల ఖాజమైనొద్దీన్, షరీన్‌బేగంలకు కుమారుడు, కూతురు ఉన్నారు. లేడీస్ కార్నర్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కుమారుడు జాఫర్ సమీ(21) హైదరాబాద్ యూసూఫ్‌గూడలోని సెంట్‌మేరీ కళాశాలలో బీబీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో తల్లిదండ్రులతో కలిసి ఆత్మకూర్ శివారులోని జూరాల ప్రధాన ఎడుమ కాల్వకు బట్టలు ఉతికేందుకు వెళ్లారు. 10 గంటల సమయంలో జాఫర్ మొహం కడుక్కుంటు కాల్వలో జారి పడ్డాడు. నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో కొట్టుకు పోయాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని స్థానిక యువకులు, మత్స్యకారుల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం రామన్‌పాడు రిజర్వాయర్ సమీపంలో మృతదేహాన్ని గుర్తించి ఒడ్డుకు చేర్చారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పంచనామా చేసి కుటుంబసభ్యులకు అప్పగించారు. కొడుకు చనిపోవడంతో తల్లిదండ్రుల రోదన పలువురిని కంటతడి పెట్టించింది. ఈ ఘటనతో ఆత్మకూర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

గోవా మద్యం పట్టివేత



కృష్ణా: మండల సరిహద్దులోని చెక్‌పోస్టు వద్ద బుధవారం ఎక్సైజ్ అధికారులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా గోవా నుంచి తరలిస్తున్న 6.75 లీటర్ల మద్యం పట్టుకుని సీజ్ చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ సతీష్ తెలిపారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. సిబ్బంది సయ్యద్ బాషా, సురేష్, ఆనంద్ ఉన్నారు.

ఉల్లిఘాటు

- క్వింటాల్ గరిష్టంగా రూ.4,600



మార్కెట్‌లో అమ్మకానికి వచ్చిన ఉల్లి

దేవరకద్ర: ఉల్లి ధరలు చుక్కల నంటాయి. బుధవారం దేవరకద్ర మార్కెట్‌లో నిర్వహించిన వేలంలో ఈ ఏడాది రికార్డు ధరలకు చేరుకున్నాయి. ఇటీవల వరకు టామాట, పచ్చిమిర్చి ధరలు కిలో రూ.రెండు వందల స్థాయికి చేరుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఉల్లి వంతు వచ్చింది సామాన్య ప్రజలకు అందనంత ఎత్తుకు ఉల్లి ధరలు ఎదుగుతుండగా పండించిన రైతుకు కాసుల వర్షం కురిపిస్తుంది. గత సీజన్‌లో పండించిన ఉల్లిని ఇప్పటికి అమ్ముకోకుండా నిల్వ చేసుకున్న రైతులకు లాభాలను తెచ్చిపెట్టింది. ఇప్పుడిప్పుడే దిగుబడులు వస్తున్న కొత్త ఉల్లి రైతుకు కూడా లాభాలను అందించే పరిస్థితి వచ్చింది.

రెండింతలు పెరిగిన ధర..

ఈ ఏడాది జనవరి నుంచి ఉల్లి సీజన్ ప్రారంభం అయిన కేవలం రూ.వేయి వరకు ధరలు నమోదయ్యాయి. దాదాపు అయిదు నెలల పాటు ఉల్లి ధరలు పెరగలేదు. రైతులు చాల మంది ఉల్లిని అమ్ముకోకుండా నిల్వ చేసుకున్నారు. ఆ తరువాత జూన్ నుంచి ఆగస్టు వరకు ధరలు రెండింతలు అయ్యావి. రూ.2 వేల వరకు ఉల్లి ధర చేరింది. సెప్టెంబర్‌లో మరికొంత పెరిగి రూ.3 వేల వరకు ఉల్లి ధర చేరింది. ఇక అక్టోబర్ ప్రారంభం నుంచి ఉల్లి ధర నిలకడగా ఉన్నా.. ఈ వారం ఏకంగా రూ.4 వేల మార్కు దాటింది.

క్వింటాల్ ధర రూ.4,600

దేవరకద్ర మార్కెట్‌లో బుధవారం జరిగిన ఉల్లి వేలంలో క్వింటాల్ ఉల్లి ధర గరిష్టంగా రూ.4,600, కనిష్టంగా రూ.3,600 లుగా ధరలు పలికాయి. ఇక కొత్త ఉల్లికి ధర రూ.4,050 వరకు వచ్చింది. ఇతర మార్కెట్‌లో ఉల్లి ధరలు పెరగడంతో ఇక్కడ కూడా ఆ ప్రభావం పడిందని వ్యాపారులు అంటున్నారు. సీజన్‌లో వచ్చిన విధంగా నాణ్యమైన ఉల్లి అయితే ఏకంగా రూ.అయిదు వేల వరకు ధర వచ్చేదని వ్యాపారులు తెలిపారు.

45 కిలోల బస్తా ధర రూ.2,300

దేవరకద్ర మార్కెట్‌లో వేలంలో కొనగోలు చేసిన ఉల్లిని తూకం వేసిన తరువాత 45 కిలోల బస్తాను గరిష్టంగా రూ.2,300, కనిష్టంగా రూ.1,800 వరకు అమ్మకాలు సాగించారు. కొత్త ఉల్లి బస్తా రూ.2,000 వరకు విక్రయించారు.

ఎన్నికల ‘ఉపాధి’



- ఎన్నికల వేళ పలు రంగాలకు డిమాండ్
- అద్దె వాహనాలు, అడ్డా కూలీలకు ఫుల్ గిరాకీ
- కళాకారులతో జోరుగా ప్రచారం
- క్యాటరింగ్‌కు సైతం భారీగా ఖర్చు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఎన్నికల్లో గెలుపునకు అభ్యర్థులు ఎంత ఖర్చయినా భరిస్తారు. ముమ్మర ప్రచారం నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకుంటారు. అభ్యర్థుల ఎంపిక నుంచి మొదలు ఎన్నికలు పూర్తయ్యేంత వరకు ప్రచారం హోరెత్తనుంది. ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికల్లో ఆయా పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు అత్యధికంగా పోటీ చేసే అవకాశం ఉంది. ఈ క్రమంలో పలువురికి ఉపాధి లభించనుంది.

రవాణా సౌకర్యం..

అభ్యర్థులతో పాటు నాయకులు, కార్యకర్తలను ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లడానికి వాహనాలను సమకూర్చుతారు. ఒక్కో వాహనం అద్దె రోజుకు రూ.3వేల నుంచి రూ.4వేల వరకు యజమానులకు సమకూరనుంది. అధిక సంఖ్యలో వాహనాలు మండల కేంద్రాల్లో, పట్టణాల్లో తిరగాల్సి ఉండటంతో ఇంధన వినియోగం పెరిగే అవకాశం ఉంటుంది. ఇదే కాకుండా అభ్యర్థుల ప్రచార ఫ్లెక్సీలు పెట్టుకుని ఆటోలు, జీపులను తిప్పుతుంటారు.

ఫొటో, వీడియోలు తీసేందుకు..

అభ్యర్థుల ప్రచార చిత్రాలు తీసేందుకు వీడియో, ఫొటోగ్రాఫర్లకు డిమాండ్ ఉంటుంది. ప్రచారం పూర్తయ్యేంత వరకు ఒక్కో ఫొటోగ్రాఫర్‌కు రూ.25 వేల నుంచి రూ.30 వేలు, వీడియో గ్రాఫర్‌కు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు చార్జీలు తీసుకుంటారు. సభలు, సమావేశాలు, ప్రచార ర్యాలీల సమయంలో అభ్యర్థులు సొంత ఖర్చులతో వీరిని నియమించుకోనున్నారు.

కళాకారులతో సందడి..

అభ్యర్థుల ప్రచారం కళాకారుల సందడితో కొత్త శోభను సంతరించుకోనుంది. డప్పు కళాకారులు, పాటలు పాడే వారితో సీడీలను రూపొందించారు. వినూత్న వేషధారణతో ప్రచారం చేపట్టే వారికి ఆదరణ ఉంటుంది. వారం రోజుల ప్రచారానికి ఒక్కో అభ్యర్థి వద్ద రూ.10వేల నుంచి రూ.20వేల వరకు రుసుం తీసుకుంటారు. జిల్లాలోని కళాకారులకు ఉపాధి లభించనుంది.

కరపత్రాల ముద్రణ..

అభ్యర్థుల ప్రచారానికి కరపత్రాలను ప్రధానాస్త్రాలుగా భావిస్తారు. తమ హామీలను పత్రంపై ముద్రించి పంచే అవకాశం ఉంది. ఒక్కో అభ్యర్థి వేలాది కరపత్రాల ముద్రణకు రంగం సిద్ధం చేస్తారు. ఒక్కో పత్రం రూ.3 నుంచి రూ.5 వరకు ధర పలికినా రూ.లక్షల్లో ఖర్చు చేస్తారు. అభ్యర్థి ఓటర్లకు సంబంధించిన వివరాలు తెలుసుకునేందుకు జిరాక్స్ కేంద్రాలను ఆశ్రయిస్తారు. ఒక్కో బూత్ పరిధిలో రూ.250 నుంచి రూ.450 వరకు ఓటరు జాబితాలను విక్రయించే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. కలర్ జిరాక్స్ జాబితాలకు ఛార్జీలు అదనం.

వాహనాలకు ఫ్లెక్సీలు..

అభ్యర్థుల ప్రచారానికి సంబంధించిన వాహనాలకు ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తారు. వాహనానికి మూడు వైపులా ఫ్లెక్సీ ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో ఫ్లెక్సీ ధర రూ.600 నుంచి రూ.800. ఈ లెక్కన వాహనానికి రూ.1800 నుంచి రూ.2400 వరకు ఖర్చవుతోంది.



సిద్ధమవుతున్న ప్రచార రథం

అల్పాహారం, భోజన వసతి..

ఒక్కో అభ్యర్థికి వందలాది మంది ప్రచారం చేస్తారు. వీరందరికీ ఉదయం అల్పాహారం పెట్టాల్సి ఉంటుంది. ఒక్కో వ్యక్తికి అల్పాహారానికి రూ.25, మధ్యాహ్నం, రాత్రి భోజనానికి కలిపి రూ.120 ఖర్చు కానుంది. ఈ లెక్కన ఒక్కో వ్యక్తికి రూ.175 నుంచి రూ.200 వరకు ఖర్చు చేయనున్నారు. ఇక క్యాటరింగ్ సేవలకు భారీ డిమాండ్ ఉండనుంది.

ప్రచారానికి టీ షర్టులు..

ఎన్నికల ప్రచారంలో అభ్యర్థుల పేర్లు, చిత్రాలతో టీ షర్టులను ముద్రించి యువకులకు పంపిణీ చేసే వీలుంది. ఏ వీధిలో చూసినా అభ్యర్థి పేరు మార్మోగాలని ఇదో రకం వ్యూహం. ఒక్కో టీషర్టు ధర రూ.180 నుంచి రూ.250 వరకు ధర పలుకుతోంది. ఉమ్మడి జిల్లాలో వేలాది టీషర్టులు ముద్రించే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన వీటికే రూ.లక్షల్లో ఖర్చు చేసే అవకాశం ఉంది.

కూలీలకు డిమాండ్..

జిల్లాలో పట్టణాలు, గ్రామాల్లోని అడ్డా కూలీలతో ప్రచారం చేపట్టే అవకాశం ఉంది. పట్టణాల్లో 600–800మంది కూలీలు ప్రచార ర్యాలీల్లో పాల్గొంటారని అంచనా. ఒక్కో కూలీకి రూ.300 నుంచి రూ.400 వరకు చెల్లిస్తారు. గ్రామాలు, పట్టణాల్లో బోనాలతో ర్యాలీలు తీయడానికి రూ.లక్షల్లో ఖర్చు చేస్తారు. ఎన్నికల వేళ ఆయా పార్టీలకు చెందిన అభ్యర్థులకు బోనాలతో ప్రచారం చేయడానికి డిమాండ్ ఉండనుంది. ఇక డప్పు, డోలు కళాకారులకు కొదువే ఉండదు.

ఫైసా కొట్టు.. ఫాలోవర్లను పట్టు!

- ఎన్నికల వేళ సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం
- తాత్కాలికంగా సోషల్ స్ట్రాటజిస్టుల నియామకం



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఎన్నికల ప్రచార సభలకు డబ్బులిస్తే వేల సంఖ్యలో జనం హాజరు కావడం సహజం. అదే సోషల్ మీడియాలో ఫాలోవర్లను పెంచుకుంటే ఒక్క పోస్టుతో వేలు, లక్షల మందిని చేరుకోవచ్చు. అయితే ఇప్పటికిప్పుడు వ్యక్తిగత ఖాతా/పేజీ తెరిచి ఫాలోవర్లు పెరిగే వరకు ఎదురు చూడటం సుదీర్ఘ ప్రక్రియ. ఇవేవీ లేకుండా పైసా కొడితే వేలు, లక్షల సంఖ్యలో ఫాలోవర్లను తెచ్చి పెట్టే విధానం అందుబాటులోకి వచ్చింది. ఎన్నికల నేపథ్యంలో లక్షల సంఖ్యలో ఫాలోవర్లు ఉండే సోషల్ మీడియా పేజీలను కొందరు డబ్బులకు అమ్మేస్తున్నారు. ఒక్కో ఫాలోవర్‌కు రూ.3 నుంచి రూ.5 వరకు ధర నిర్ణయిస్తున్నారు. ఎన్నికల వేళ వీటికి భలే డిమాండ్ ఉందని సోషల్ మీడియా స్ట్రాటజిస్టులు చెబుతున్నారు.

అందరికీ చేరువే లక్ష్యం..

ఎన్నికల బరిలో నిలబడాలనుకునే అభ్యర్థులు పైచేయి సాధించాలని భావిస్తారు. ఈ సమయంలో ఇంటింటికీ వెళ్లి ప్రజా సంబంధాలు పెంచుకునేందుకు హోర్డింగులు, ఫ్లెక్సీలతో ప్రకటనలు గుప్పించడం ఒకెత్తు. సోషల్ మీడియా ద్వారా విస్తృత స్థాయిలో అందరికీ చేరువై తటస్థ ఓటర్లను ఆకర్షించడం మరో ఎత్తు. ఈ తరహా ప్రచారంపై రాష్ట్ర స్థాయి నేతలే కాదు.. నియోజకవర్గ స్థాయి నేతలూ గురి పెట్టారు. బహుళ ప్రజాదరణ పొంది, లక్షల్లో ఫాలోవర్లు ఉండే పేజీలను డబ్బులిచ్చి కొనుగోలు చేస్తున్నారు. తాత్కాలికంగా సోషల్ స్ట్రాటజిస్టులను నియమించుకుంటున్నారు.

సామాజిక మాధ్యమాల్లో ముందస్తుగా..

కొందరు నేతలు సోషల్ మీడియాల్లో సొంతంగా ఖాతాలు తెరిచి ముందస్తుగా ప్రకటనలు ఇస్తున్నారు. నిర్ణీత రుసుముతో ఫేస్‌బుక్ ఇన్‌స్ట్రాగమ్‌లో ఈ వ్యవస్థ అందుబాటులో ఉంది. యూట్యూబ్ తరహాలో ఈ ప్రకటనలు ఖాతాదారులందరికీ వస్తాయి. రీల్స్, పోస్టులు చూస్తున్నప్పుడు వివిధ రాజకీయ అభ్యర్థుల ప్రకటనలు విరివిగా వస్తాయి. ఆయా అభ్యర్థుల ఖాతాలను ఫాలో కాకున్నా ప్రకటనలు కనిపిస్తాయి.

వీళ్లకు భలే డిమాండ్..

ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియా స్ట్రాటజిస్టులకు భలే డిమాండ్ ఉంది. వీరిని వివిధ పార్టీల అభ్యర్థులు, ఆశావాహులు తాత్కాలిక ప్రాతిపదికన నియమించుకుంటున్నారు. ఎన్నికలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు పర్యటనలు, ప్రసంగాలు, నియోజవర్గ స్థాయిలో ప్రజలను ఆకట్టుకునేలా పోస్టులు చేయడానికి ఉపయోగించుకుంటున్నారు. ఇలా వ్యూహకర్తలను అందించేందుకు ఇటీవల ప్రత్యేకంగా కన్సల్టెన్సీలు ఏర్పాటైనట్లు సమాచారం.

లక్షల్లో ఫాలోవర్లు..

సోషల్ మీడియాలో పోస్టులు, అందులో ఉండే కంటెంట్ నచ్చితేనే ఎక్కువ మంది అనుసరిస్తారు. ఉదాహరణకు కొందరు ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగమ్, ట్విటర్ ఖాతా/పేజీ ప్రారంభిస్తారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రజలకు చేరువయ్యే పేరుతో ఇవి మొదలవుతాయి. అడ్మిన్లు ఈ పేజీలో రాష్ట్రవ్యాప్తంగా వర్తమాన రాజకీయాలకు సంబంధించిన పోస్టులు, నేతల ప్రసంగాల వీడియోలు, కార్టూన్లు నిత్యం పోస్టు చేస్తుంటారు. నెలల వ్యవధిలో ఫాలోవర్ల సంఖ్య లక్షల్లోకి చేరుతుంది. ఫాలోవర్లు బాగా పెరిగాక అడ్మిన్లను తొలగిస్తారు. ఒక్కో ఫాలోవర్‌కు వేలల్లో ధర నిర్ణయిస్తారు. ఎవరైనా ఈ డబ్బులు చెల్లిస్తే ఖాతాను వారి పేర్ల మీదకు మార్చేస్తారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ

- ప్రయాణికురాలికి బ్యాగు అందజేత

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆటోలో బ్యాగు మరిచిపోయిన ప్రయాణికురాలికి ఆటో డ్రైవర్ తన నిజాయితీ చాటుకుంటూ బ్యాగ్ ఇచ్చిన సంఘటన బుధవారం జిల్లా కేంద్రంలో జరిగింది. ఆటో యూనియన్ నాయకుడు రాములుయాదవ్ మాట్లాడారు. గద్వాలకు చెందిన ఓ మహిళ హంద్రీ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణించి మహబూబ్‌నగర్ స్టేషన్‌లో దిగి, అక్కడి నుంచి ఆటోలో నలంద ఆటో స్టాండ్ వరకు ప్రయాణించిందని తెలిపారు. బ్యాగ్ మరిచిపోవడాన్ని గమనించిన ప్రయాణికురాలు వెంటనే రైల్వేస్టేషన్‌కు రాగా అప్పటికే ఆటో డ్రైవర్ బషీరుద్దీన్ ఆ బ్యాగ్‌ను నాకు అందజేసినట్లు తెలిపారు. వెంటనే బ్యాగులో వస్తువులను పరిశీలించి ప్రయాణికురాలికి అప్పగించినట్లు తెలిపారు. బ్యాగులో నాలుగు తులాల బంగారం, పెళ్లికి సంబంధించిన వస్తువులు ఉన్నట్లు తెలిపారు. ఆటో డ్రైవర్ బషీరుద్దీన్‌ను రాములుయాదవ్‌తో పాటు ఇతర ఆటో డ్రైవర్లు అభినందించారు.



ప్రయాణికురాలికి బ్యాగ్ అందజేస్తున్న రాములుయాదవ్ తదితరులు

ప్రచార అస్త్రంగా ‘పాలమూరు’

అచ్చంపేట: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా అచ్చంపేట, వనపర్తికి వస్తున్న సీఎం కేసీఆర్ ప్రధానంగా ఎన్నికల అస్త్రంగా పాలమూరు–రంగారెడ్డి, అచ్చంపేట ఎత్తిపోతల పథకాలను ప్రస్తావించే అవకాశం ఉంది. 2018 నవంబర్ 27న సీఎం కేసీఆర్ అచ్చంపేటకు రాగా.. ఎత్తు ప్రాంతాలైన అచ్చంపేట, అమ్రాబాద్, పదర, బల్మూర్, లింగాల, ఉప్పునుంతల మండలాలకు సాగునీరు అందించి నల్లమలను పచ్చబడేలా సస్యశ్యామలం చేస్తామని హామీ ఇచ్చారు. అచ్చంపేట మొదటి దశ పనులకు టెండర్ ప్రక్రియ పూర్తి కాగా.. ఫేజ్– 2 టెండర్ దశలో ఉంది. ఇదే ఎన్నికల సమయంలో పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేసి కరువు ప్రాంతాలైన ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, వికారాబాద్, నల్లగొండ జిల్లాల్లో 12 లక్షల ఎకరాలకు సాగునీరు అందించి ప్రతి ఎకరా, గుంటకు పారేలా చేస్తామని హామీ ఇచ్చారు. గత నెలలో సీఎం కేసీఆర్ ఎల్లూరు పంపుహౌస్‌ను ప్రారంభించడంతో నీటిని ఎత్తిపోస్తున్నారు. త్వరలో కృష్ణా జలాలు రానుండడంతో ప్రతిష్టాత్మక హామీ నెరవేరబోతుందని, ఉమ్మడి జిల్లా ప్రజల చిరకాల కోరిక తీరుతుందని కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభల్లో మాట్లాడే అవకాశం ఉందని చర్చ జరుగుతుంది.

ప్రజా ఆశీర్వాదంతో లక్ష మెజార్టీతో గెలుస్తా

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రజా ఆశీర్వాదంతో అసెంబ్లీ ఎన్నికల్లో లక్ష మెజార్టీతో గెలుస్తానని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పాలకొండ నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఏ కష్టం రాకుండా చూస్తానని తెలిపారు. పాలకొండ ఒకప్పుడు మారుమూల గ్రామంగా ఉండేదని, ఇప్పుడు మున్సిపాలిటీ పరిధిలోకి రావడమే కాకుండా సమీపంలో బైపాస్ రోడ్డు నిర్మించినట్లు తెలిపారు. పదేళ్ల అభివృద్ధికి ఇది ఒక ఉదాహరణ మాత్రమే అని, రాష్ట్రంలోనే మొట్టమొదటి మెడికల్, నర్సింగ్, పారా మెడికల్ కళాశాలలను తెచ్చినట్లు తెలిపారు. జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకు అనుమతి వచ్చినట్లు తెలిపారు. ఐటీ, లిథియం పరిశ్రమతో వేల సంఖ్యలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. కేసీఆర్ సహకారంతో పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగునీళ్లు అందిస్తామన్నారు. అంతకుముందు ఆంజనేయస్వామి దేవస్థానం, కల్వరి ఎంబీ చర్చి, షాషాబ్‌గుట్ట దర్గాలో కుటుంబ సమేతంగా ప్రత్యేక ప్రార్థనలు, పూజలు చేశారు.



పాలకొండలో ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

బీఆర్‌ఎస్‌లోకి ముత్యాల ప్రకాష్..

మహబూబ్‌నగర్ మున్సిపల్ మాజీ చైర్మన్ ముత్యాల ప్రకాష్ బీఆర్‌ఎస్‌లో చేరారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరగా, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ముత్యాల ప్రకాష్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్, మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నాయకత్వంలో మహబూబ్‌నగర్ అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘంగా పని చేసినప్పటికీ ఇంతటి అభివృద్ధి చూడలేదని తెలిపారు.



ముత్యాల ప్రకాష్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేటీఆర్

రూ.లక్ష దాటితే.. లెక్క చెప్పాల్సిందే

- ఆన్‌లైన్ లావాదేవీలపై ప్రత్యేక నజర్
- బ్యాంకర్లతో అధికారుల సమన్వయం
- డిజిటల్ పేమెంట్ల కట్టడికి చర్యలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఎన్నికల వేళ ఆన్‌లైన్ లావాదేవీలపై పోలీసులు, ఎన్నికల అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. కట్టల పాములనే కాదు.. ఆన్‌లైన్‌లో అడ్డగోలుగా జరిగే డిజిటల్ పేమెంట్లకు కట్టడి వేసేందుకు సమాయత్తమవుతున్నారు. గత ఎన్నిలతో పోలిస్తే ప్రస్తుతం డిజిటల్ చెల్లింపులు రెట్టింపయ్యాయి. చిన్న మొత్తాల్లో సొమ్మును గూగుల్ పే, ఫోన్‌పే ఇతర యూపీఐ యాప్‌లతో చెల్లిస్తున్నారు. ఇప్పటి వరకు సాధారణ లావాదేవీలు జరిగే బ్యాంకు ఖాతాల్లో అనూహ్యంగా నగదు బదిలీలు పెరగడం.. పరిమితికి మించి డబ్బుజమ, విత్‌డ్రాలపై నిఘా ఉండనుంది. ఇందుకు బ్యాంకర్లతో పోలీసులు, ఐటీ విభాగం, అధికార యంత్రాంగం సమన్వయంతో పని చేయనున్నాయి. ఇందుకు రిజర్వు బ్యాంకు సాయం తీసుకోవాలని నిర్ణయించారు.

ఎన్నికల నియమావళి ప్రకారం జిల్లా ఎన్నికల అధికారుల ఆధ్వర్యంలో లావాదేవీలపై నిఘా ఉంటోంది. బ్యాంకుల్లో రూ.లక్షకు మించి డబ్బు జమ, ఉపసంహరణకు సంబంధించిన లావాదేవీ ఉంటే అంతర్గతంగా తనిఖీ చేస్తారు. రూ.10లక్షల కంటే ఎక్కువ లావాదేవీ ఉంటే ఆదాయపు పన్ను శాఖకు వివరాలు అందిస్తారు. ఇప్పటికే అనుమానాస్పదన లావాదేవీలపై నిఘా మొదలైనట్లు తెలుస్తోంది.

జీరో ఖాతాలపై దృష్టి..

ప్రధానంగా జీరో బ్యాంకు ఖాతాలు, ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన ఖాతాలను నిశితంగా గమనిస్తున్నట్లు ఎన్నిక అధికారులు, పోలీసులు చెబుతున్నారు. ఎన్నికల ముందు వరకు లావాదేవీలు లేకుండా తర్వాత అనూహ్యంగా పెరిగితే కారణాలపై ఆరా తీస్తారు. గత ఎన్నికల సందర్భంగా లక్షల ఖాతాల్లో అనుమానాస్పదంగా నగదు జమ కావడాన్ని గుర్తించినట్లు అధికారులు తెలిపారు. దీనిపై ఖాతాదారులతో ఆరా తీయగా.. ఇతరులు తాత్కాలికంగా ఉపయోగించినట్లు వెల్లడైందని వివరించారు.

హున్యానాయక్‌కు ఘన నివాళి



హున్యానాయక్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ కవిత, ఎంపీ వెంకటేష్ నేత, ఎమ్మెల్యేలు

బాలానగర్: సింగరేణి ఫైనాన్స్ డైరెక్టర్ బల్‌రాం నాయక్ తండ్రి హున్యానాయక్ ఈ నెల 15న మృతి చెందగా.. బుధవారం దశదినకర్మ నిర్వహించగా.. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండల పరిధిలోని తిరుమలగిరిలోని బల్‌రాం నాయక్ స్వగృహంలో దశదినకర్మ నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ కవిత, స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేత, ఎంపీ రాజ్యసభ వద్దిరాజు రవిచంద్ర, వికారాబాద్ కలెక్టర్ నారాయణ రెడ్డి, యూపీ ఐఏఎస్ అధికారి శ్రీనివాస్, జీసీసీ చైర్మన్ వాల్యానాయక్, డీసీఎంఎస్ ప్రభాకర్ రెడ్డి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, పలువురు ప్రముఖులు హున్యానాయక్ చిత్రపటానికి నివాళి అర్పించి బల్‌రాం నాయక్ కుటుంబానికి సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడారు. ఎంతో మంది ఉత్తములను కన్న తండ్రి, ఉత్తములకు నిలయంగా మార్చిన గొప్ప వ్యక్తి హున్యానాయక్ అని సంబోధించారు. హున్యానాయక్‌ను అందరూ స్ఫూర్తిగా తీసుకొని పిల్లల బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని సూచించారు. హున్యానాయక్‌కు భార్య కేస్లీ, నలుగురు కుమారులు ఉన్నారు.

భారీగా నగదు సీజ్



పెబ్బేరు మండలం రంగాపురం చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన నగదు



పట్టుబడిన నగదుతో నవాబుపేట పోలీసులు

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా వ్యాప్తంగా బుధవారం నిర్వహించిన తనిఖీల్లో రూ.17,01,040 నగదు సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని టూటౌన్ పోలీసుల తనిఖీల్లో రూ.8లక్షలు, వన్‌టౌన్ పోలీసులు రూ.3,08,250, నవాబ్‌పేట పోలీసులు రూ.4లక్షల 90వేలు, సీసీకుంట పోలీసులు 1,02,800 నగదు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

వనపర్తి: జిల్లావ్యాప్తంగా రూ.6.98 లక్షల నగదు సీజ్ చేసినట్లు ఎస్పీ రక్షితా కె.మూర్తి వెల్లడించారు. వీపనగండ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో రూ. 96వేలు, ఆత్మకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ. 2.02లక్షలు, పెబ్బేరు పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ.4లక్షల నగదు పట్టుకున్నట్లు తెలిపారు.

జడ్చర్ల టౌన్: పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న రూ.3లక్షల నగదును పట్టుకున్నట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. పోచమ్మ గడ్డ తండాకు చెందిన ముడావత్ కిరణ్ నుంచి రూ.లక్ష, కావేరమ్మపేటకు చెందిన ఖలీల్ అహ్మద్ నుంచి రూ.2లక్షలు పట్టుకుని సీజ్ చేశామన్నారు.

గద్వాల క్రైం/గద్వాల రూరల్: జిల్లావ్యాప్తంగా పలు చెక్‌పోస్టుల వద్ద రూ.2,75,880 నగదు పట్టుబడగా, సీజ్ చేసినట్లు ఎస్పీ రితిరాజ్ ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా ధరూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు వైన్ షాపులకు సంబంధించిన డబ్బులు, ఉండవెల్లి పోలీసుస్టేషన్ పరిధిలో బైక్ కొనుగోలు, గద్వాల టౌన్‌లో టింబర్ డిపోలో కట్టెల కొనుగోలు, గద్వాల రూరల్ పరిధిలో హోల్‌సేల్ వ్యాపారి పామాయిల్ కొనుగోలుకు సంబంధించి రూ.15,04,930 నగదు తరలిస్తుండగా, పట్టుకున్నట్లు అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాసులు తెలిపారు. నగదుకు సంబంధించి సరైన ధ్రువపత్రాలు చూపెట్టడంతో ఐదుగురికి తిరిగి డబ్బులు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

కృష్ణా: మండల సరిహద్దులోని చెక్‌పోస్టు వద్ద రూ.4లక్షల 16వేల నగదును పట్టుకున్నట్లు ఏఎస్‌ఐ సురేందర్ తెలిపారు. కర్ణాటకలోని రాయచూర్‌కు చెందిన గంగాధర్ ఎలాంటి పత్రాలు లేకుండా నగదు తరలిస్తుండగా, పట్టుకుని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

2014 టు 2024... నారా – పవన్ ఉమ్మడి సమర్పణలో...

మోసానికి మళ్లీ రెడీ

- మరోసారి మోసపూరిత హామీలతో ఉమ్మడి మేనిఫెస్టోకు బాబు– పవన్ రెడీ
- 2014 ఎన్నికల్లో కూడా పవన్ ఫొటోతో మేనిఫెస్టోను విడుదల చేసిన టీడీపీ
- హామీలంటూ కరపత్రాలపై చంద్రబాబు–పవన్ ఉమ్మడి సంతకాలు
- ఎన్నికల్లో గెలిచాక హామీలు గాలికి...


2014 ఎన్నికలకు ముందు నారా చంద్రబాబు నాయుడు, పవన్‌కళ్యాణ్ ఫొటోలతో పత్రికలకు విడుదల చేసిన టీడీపీ మేనిఫెస్టో

(సాక్షి, అమరావతి)

పదేళ్ల కిందట కలసికట్టుగా మేనిఫెస్టో విడుదల చేసి, ఎన్నికల్లో గెలిచాక దాన్ని చెత్తబుట్టలో పడేసిన చంద్రబాబు– పవన్ కల్యాణ్‌ల ద్వయం... మళ్లీ అదే మోసానికి ఒడిగడుతోంది. పైపెచ్చు ఇదేదో ఇప్పుడే తొలిసారి చేస్తున్నట్లుగా... తెలుగుదేశం– జనసేన తొలి ఉమ్మడి మేనిఫెస్టో అనే కలరింగుతో జవన్ కల్యాణ్ ఊదరగొట్టేస్తున్నారు. మరి 2014 ఎన్నికల మేనిఫెస్టో సంగతేంటి పవన్ కల్యాణ్? ఆ మేనిఫెస్టోపై చంద్రబాబుతో పాటు మీ ఫొటో కూడా ఉందిగా? 'టీడీపీకి ఓట్లేయండి.. హామీలు అమలు చేసే బాధ్యత నాది'అని 2014 ఎన్నికల్లో బహిరంగంగా టీడీపీ తరఫున ప్రజలకు పూచీకత్తుగా నిలిచారుగా? టీడీపీ గెలిచిన తరవాత హామీలను అమలు చేయకపోయినా ఒక్కసారైనా ప్రశ్నించారా? అసలు మేనిఫెస్టోనే కనిపించకుండా వెబ్‌సైట్ నుంచి మాయం చేసేసిన చంద్రబాబు నాయుడిని ఎన్నడైనా నిలదీశారా? మళ్లీ ఇపుడు ఏం మొహం పెట్టుకుని ఉమ్మడి మేనిఫెస్టో కథ అల్లుతున్నారు? మీరు తెలుగుదేశాన్ని నిలదీస్తారంటే నమ్మేదెవరు? మీరు హీరోలా ఒక్క సీన్లోనూ కనిపించని సినిమాను అదే స్క్రీన్‌ప్లే, డైలాగులతో మళ్లీ మళ్లీ జనం ముందుకు తెస్తే మాత్రం చూసేదెవరు?

ఎప్పుడో పదేళ్ల క్రితం జరిగింది కాబట్టి ఇప్పుడు జనం ఆ మోసాన్ని మర్చిపోయి ఉంటారులే అనుకుంటూ చంద్రబాబు నాయుడు- పవన్ కల్యాణ్ మళ్లీ అదే స్కీముతో జనం ముందుకు రావటం ఆంధ్రప్రదేశ్‌లో ఇపుడు చర్చనీయమవుతోంది. పదేళ్ల కిందట 2014 ఎన్నికల్లో... టీడీపీ ఇచ్చిన హామీలను అమలు చేయించే బాధ్యతను నెత్తికెత్తుకున్నానని, అమలు చేయకుంటే నిలదీసే బాధ్యత కూడా తనదేనంటూ పవన్‌కళ్యాణ్ ప్రజలకు వాగ్దానమిచ్చారు. 2014–19 మధ్య ఒక్క హామీ విషయంలో కూడా దాన్ని నిలబెట్టుకోకుండా... మళ్లీ ఇపుడు పదేళ్ల కిందటి మాటలే చెబుతుండటం జనాన్ని వంచించటం తప్ప మరొకటి కాదనేది రాజకీయ విశ్లేషకుల మాట. వాస్తవానికి 2014 ఎన్నికల్లో బీజేపీతో కలిసి టీడీపీ- జనసేన ఉమ్మడిగా పోటీ చేశాయి. అప్పట్లో తాము అధికారంలోకి వస్తే రైతు రుణాల మాఫీ చేస్తామని, డ్వాక్రా రుణాలన్నీ బేషరతుగా మాఫీ చేస్తామని, ఇంటింటికీ ఓ ఉద్యోగమిస్తామని, లేనిపక్షంలో నిరుద్యోగ భృతి ఇస్తామని బోలెడన్ని ఆకర్షణీయమైన హామీలు గుప్పించారు. ఈ మోసపూరిత హామీలకు పవన్ కల్యాణ్ గ్యారంటీ ఇచ్చారు. బీజేపీ కూడా వీరితో కలిసి పోటీ చేయటంతో ఈ కూటమి ఎన్నికల్లో గెలిచింది. ఆ వెంటనే చంద్రబాబు హామీలను అమలు చేయకుండా ఎగ్గొట్టేశారు. ఏకంగా మేనిఫెస్టోనే తమ పార్టీ వెబ్‌సైట్ నుంచి తీసేశారు. పవన్ సైతం ఈ విషయాన్ని గమనించనట్టే ఉండిపోయారు. అసలు ఏ హామీ గురించి కూడా ఒక్కనాడూ ప్రశ్నించలేదు. గెలిచిన వెంటనే పవన్ ప్యాకేజీ అందుకుని తన వేషాన్ని చాలించారన్న విమర్శలు అప్పట్లోనే వచ్చాయి.

మాఫీ జరగకపోయినా పవన్ గప్‌చుప్...

అధికారంలోకి వచ్చాక... బేషరతుగా డ్వాక్రా రుణాలన్నీ మాఫీ చేస్తామని చెప్పి, ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలో 70 లక్షల మంది డ్వాక్రా మహిళల్లో ఎవ్వరికీ పైసా రుణం కూడా చంద్రబాబు ప్రభుత్వం మాఫీ చేయలేదు. రైతు రుణ మాఫీ విషయంలోనూ అంతే. 2014 అసెంబ్లీ ఎన్నికల నాటికి రాష్ట్రంలో రైతుల పేరిట రూ.87,612 కోట్ల వ్యవసాయ రుణాలుండగా, కోటయ్య కమిటీ పేరుతో కాలయాపన చేసి, ఆ ఐదేళ్లలో కేవలం రూ.15 వేల కోట్ల రుణాలను మాత్రమే నాటి చంద్రబాబు ప్రభుత్వం చెల్లించింది. ఎన్నికల ముందు రైతులకిచ్చిన రుణ బాండ్లు చెల్లని కాగితాలయ్యాయి. బాబు రుణ మాఫీ మోసానికి కరువు కూడా తోడవటంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి రాష్ట్రమంతటా వేలాది ఎకరాలు పంటలు కూడ వేయక బీడుగా మారాయి. అయినా పవన్‌కళ్యాణ్ ఏనాడు నాటి చంద్రబాబు ప్రభుత్వాన్ని ప్రశ్నించలేదని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. ఇంటింటికీ ఉద్యోగమిస్తామన్న చంద్రబాబు ప్రభుత్వం దాన్ని గాలికొదిలేసింది. నిరుద్యగ భృతి కూడా అమలు చేయలేదు. ఇలా లక్షల మంది యువతను మోసం చేసినా పవన్‌కళ్యాణ్ కనీసం దాని గురించి ప్రశ్నించలేదు. చివరకు.. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కాపు రిజర్వేషన్ల హామీ అమలు చేయకపోయినా ప్రశ్నించకపోవడాన్ని పలువురు కాపు నేతలు గుర్తు చేస్తున్నారు.

జగన్ తీరే వేరు.. తొలిఏడాదే 80 శాతం, నాలుగేళ్లకు 99 శాతం!

ఎన్నికల్లో గెలిచాక మేనిఫెస్టోను మాయం చేసిన చంద్రబాబు– పవన్‌కల్యాణ్ ఒకపక్క ఉంటే.... 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గెలిచాక తు.చ. తప్పకుండా అమలు చేసి చూపించిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోవైపున నిలిచిన విషయాన్ని పరిశీలకులు గుర్తు చేస్తున్నారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఏడాది కాలంలోనే 80 శాతం హామీలను అమలు చేసి చూపించారు. నాలుగేళ్లు పూర్తయ్యే సరికి 99 శాతం హామీలను అమలు చేశారు. ప్రపంచవ్యాప్తంగా తలెత్తిన కోవిడ్ సంక్షోభంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు దెబ్బతిన్నా కూడా హామీల అమల్లో ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. ఇంతటి చిత్తశుద్ధికి మోకాలడ్డుతూ చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌తో పాటు వారికి అనుకూలంగా పనిచేసే కొన్ని పత్రికలు తరుచూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై అవాస్తవ కథనాలు ప్రచురించడం, వాటి ఆధారంగా కొందరు నేతలు వాటిపై కేంద్రానికి ఫిర్యాదులు చేస్తూ రాష్ట్రానికి నిబంధనల ప్రకారం రావాల్సిన నిధులను కేంద్రం నుంచి రాకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేయటం దేశ రాజకీయాల్లో ఏపీలో తప్ప ఎక్కడా లేదని పలువురు గుర్తు చేస్తున్నారు.

'దేవరగట్టు' రక్తసిక్తం



బన్ని ఉత్సవంలో అపశృతి

- చెట్టు కొమ్మ విరిగి పడి ముగ్గురు మృతి
- వైభవంగా మాళ మల్లేశ్వరుని కల్యాణోత్సవం

హొళగుంద/ఆలూరు రూరల్ (కర్నూలు): దేవరగట్టు రక్తసిక్తమైంది. ఎప్పటిలానే సంప్రదాయం పైచేయి సాధించింది. కర్రలు కరాళనృత్యం చేయగా, 84 మందికి పైగా గాయపడ్డారు. బన్ని ఉత్సవాన్ని తిలకించేందుకు ఓ చెట్టుపైకి ఎక్కిన భక్తుల్లో కొమ్మ విరిగిపడడంతో ముగ్గురు మృత్యువాత పడ్డారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత డోలు, మేళతాళాలతో ఇనుప తొడుగులు తొడిగిన కర్రలు, అగ్గి కాగడాలు, దివిటీలతో కొండ పైకి చేరిన నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామస్తులు మాత మాళమ్మ, మల్లేశ్వరునికి నెరణికి పురోహితులు, ఆలయ పూజారులు అత్యంత వైభవంగా కల్యాణోత్సవం జరిపించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల విగ్రహాలతో పాటు పల్లకీని మల్లప్ప గుడిలోని సింహాసన కట్ట మీద అధిష్ఠించారు. అక్కడి నుంచి మొదలైన జైత్రయాత్ర ఆద్యంతం ఒళ్లు జలదరించేలా ఉత్కంఠగా సాగింది.

చెట్టు కొమ్మ విరిగిపడి ముగ్గురు మృతి..

ఉత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులు సత్యనారాయణ కట్టపై ఉన్న రావి చెట్టుపై కూర్చున్న కొమ్మ విరిగి పడడంతో ముగ్గురు మృత్యువాత పడ్డారు.

కర్రల సమరంలో 84 మందికి గాయాలు

విజయదశమిని పురస్కరించుకుని మంగళవారం రాత్రి దేవరగట్టులో జరిగిన బన్ని మహోత్సవంలో ఆదినుంచి వస్తున్న సంప్రదాయమే గెలిచింది. విజయోత్సవంలో భాగంగా జరిగిన జైత్రయాత్రలో గట్టుపై రక్తం చిందింది. ఉత్సవంలో 84 మందికి గాయాలు కాగా అందులో 8 మందికి తీవ్ర గాయాలయ్యాయి. మంగళ వారం అర్ధరాత్రి ప్రారంభమైన మాళ మల్లేశ్వరస్వామి జైత్రయాత్ర బుధవారం తెల్లవారు జాము వరకు జరిగింది.

అమిత్‌షాతో పవన్‌కల్యాణ్ భేటీ!

తెలంగాణలో జనసేనతో పొత్తు, సీట్ల సర్దుబాటుపై సమావేశం

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర హోంమంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్‌షాతో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ భేటీ అయ్యారు. జనసేన, బీజేపీ కలసి తెలంగాణలో పోటీ చేస్తాయన్న ప్రచారం నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది. బుధవారం ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి నివాసంలో అమిత్‌షాతో కిషన్‌రెడ్డి, పవన్‌కల్యాణ్, నాదెండ్ల మనోహర్ సమావేశమయ్యారు. సుమారు 45 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో రెండు పార్టీల పొత్తులు, సీట్ల సర్దుబాటు అంశాలపై చర్చించినట్లు తెలిసింది. అనంతరం ఇరు పార్టీల నేతలు మీడియాతో మాట్లాడకుండానే వెళ్లిపోయారు.

20 స్థానాల్లో పోటీ చేసేందుకు జనసేన ఆసక్తి?

రాష్ట్రంలో 32కి పైగా సీట్లలో పోటీ చేసేందుకు జనసేన ఆసక్తి చూపిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే జనసేనకు 32 సీట్లు కేటాయిస్తే బీజేపీని నమ్ముకున్న వారికి అన్యాయం జరిగే అవకాశం ఉన్నట్లు బీజేపీ నేతలు అమిత్‌షా దృష్టికి తెచ్చారు. ఈ నేపథ్యంలో కనీసం 20 స్థానాల్లో జనసేన అభ్యర్థుల్ని నిలబెట్టాలనే అభ్యర్థనను పవన్ కల్యాణ్ అమిత్‌షా ముందు ఉంచినట్లు సమాచారం. ఈ విషయంపై తుది నిర్ణయంతో పాటు జనసేనకు సీట్ల సర్దుబాటు వంటి అంశాలన్నీ నవంబర్ 1వ తేదీన జరిగే సీఈసీ సమావేశం అనంతరం తేలనున్నాయి.

పవన్ ట్రాప్‌లో తెలంగాణ బీజేపీ?

- చంద్రబాబు చేతుల్లో పావుకు ఎందుకింత ప్రాధాన్యం
- తెలంగాణలో ఏమాత్రం బలంలేని జనసేనతో పొత్తుకు ఎందుకీ వెంపర్లాట...
- బీజేపీ నాయకులు, కార్యకర్తల్లో తీవ్ర అసంతృప్తి

సాక్షి, హైదరాబాద్: టీడీపీ అధినేత చంద్రబాబు చేతుల్లో పావుగా పనిచేస్తున్న జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ట్రాప్‌లో తెలంగాణ బీజేపీ పడుతోందా? అన్న సందేహాలు కమలనాథులను, ఆ పార్టీ శ్రేణులను వెంటాడుతున్నాయి. తెలంగాణలో ఏ మాత్రం బలం లేని,, కనీసం కేడర్ కూడా లేని జనసేనతో అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తు ఏమిటనే ప్రశ్న తలెత్తుతోంది. మరో 35 రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉండగా.. అర్థంతరంగా జనసేనతో బీజేపీ పొత్తు అని, ఆ పార్టీ ఏకంగా 32 సీట్లు కోరుతోందనే ప్రచారం పార్టీ శ్రేణులను కలవరానికి గురిచేస్తోంది. తెలంగాణలో పొత్తులపై చర్చ అంటూ బుధవారం ఏకంగా కేంద్రహోంమంత్రి అమిత్‌షా సమక్షంలోనే పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమావేశం కావడం బీజేపీ కేడర్‌ను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. తెలంగాణలో కనీస బలం లేని జనసేనతో పొత్తుకు ఎందుకీ వెంపర్లాట అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఏపీలో పొత్తుకోసం ఒత్తిడి తెచ్చేందుకేనా..

ఏపీలో బీజేపీతో టీడీపీ–జనసేన పొత్తు కోసం ఒత్తిడి తెచ్చేందుకే తెలంగాణలో బీజేపీతో కలిసి జనసేన పోటీ చేస్తోందన్న వాదనలు బలంగా ఉన్నాయి. ఇందుకు తెరవెనక టీడీపీ అధినేత చంద్రబాబు పాత్ర ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పవన్ కల్యాణ్‌తో కిషన్‌రెడ్డి, డా.లక్ష్మణ్ భేటీకి రెండురోజుల ముందు... వారిద్దరితో గతంలో టీడీపీ–బీజేపీ పొత్తు ఖరారులో కీలకపాత్ర వహించిన ఓ బడాబాబు(రాజ్యాంగ పదవి నిర్వహించి ఇటీవల పదవీ విరమణ చేసిన వ్యక్తి) భేటీ అయ్యారన్న వార్త ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఎన్నో ఏళ్ల టీడీపీ పొత్తును వదిలించుకుని, 2018లో ఒంటరిగా పోటీ చేసిన బీజేపీకి ఇప్పుడు మళ్లీ జనసేనతో పొత్తు అవసరం ఏమొచ్చిందన్న ప్రశ్నలు బీజేపీ నాయకులు, కార్యకర్తల నుంచి ఇప్పుడు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

నేటి నుంచి 'సామాజిక సాధికార యాత్ర'

- ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఏపీ సీఎం జగన్ చేసిన మేలును వివరిస్తాం..
- ఏపీ మంత్రులు, వైఎస్సార్‌సీపీ నేతల వెల్లడి

సాక్షి, అమరావతి: దేశ చరిత్రలో సామాజిక న్యాయాన్ని, ధర్మాన్ని పాటించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని ఏపీ మంత్రులు జోగి రమేష్, ఆదిమూలపు సురేశ్, మేరుగు నాగార్జున, ప్రభుత్వ సలహాదారు (మైనార్టీ వ్యవహారాలు) జియావుద్దీన్, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతు నాయక్‌లు ప్రశంసించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీఎం జగన్ చేసిన మంచిని వివరించి.. ఆయా వర్గాలను ఏకం చేయాలన్న లక్ష్యంతో సామాజిక సాధికార యాత్ర పేరుతో బస్సు యాత్రను వైఎస్సార్‌సీపీ చేపట్టిందన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నుంచి ప్రారంభం కానున్న వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార యాత్ర పోస్టర్లను వారు ఆవిష్కరించారు. అనంతరం సామాజిక సాధికార యాత్ర బస్సుకు పూజలు చేసి, ప్రారంభించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ ఏపీ వ్యాప్తంగా మూడు ప్రాంతాల్లో మూడు విడతలుగా సామాజిక సాధికార యాత్ర జరుగుతుందన్నారు. తొలి విడత యాత్ర గురువారం ప్రారంభమవుతుందని.. నవంబర్ 9న ముగుస్తుందని చెప్పారు. రోజూ మూడు ప్రాంతాల్లో ఒక్కో నియోజకవర్గంలో ఈ యాత్ర జరుగుతుందని.. సాయంత్రం బహిరంగ సభలు నిర్వహిస్తామన్నారు. తొలి విడతలో మూడు ప్రాంతాల్లోని 39 నియోజకవర్గాల్లో ఈ యాత్ర సాగుతుందని వివరించారు. యాత్రలో పేదలందరినీ ఏకం చేసి పెత్తందార్లపై రణభేరి మోగిస్తామని ప్రకటించారు. వచ్చే ఎన్నికల సంగ్రామంలో.. పేదల పక్షాన నిలిచిన సీఎం వైఎస్ జగన్‌కు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు దన్నుగా నిలిచి, పెత్తందార్లను మట్టికరిపించాలని పిలుపునిచ్చారు.

జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం బుధవారం రాత్రి 9 గంటల వరకు 1,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆవిరి రూపంలో 103 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 1,140 క్యూసెక్కులు, కుడి కాల్వకు 731 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 150 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 1,974 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 6.658 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

రామన్‌పాడులో 1,020 అడుగులు..

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో బుధవారం ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం 1,020 అడుగుల కు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 820 క్యూసె క్కులు, సమాంతర కాల్వ నీటిని నిలిపేశారు. ఎన్‌టీఆర్ కాల్వ ద్వారా వ్యవసాయ అవసరాలకు 1,050 క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా 15 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 15 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ రనీల్ రెడ్డి తెలిపారు.

కోయిల్‌సాగర్‌కు జలకళ

దేవరకద్ర: జూరాల నుంచి ఒక మోటర్ ద్వారా నీటిని విడుదల చేయడంతో కోయిల్‌సాగర్‌కు జలకళ సంతరించుకుంది. ఒక వైపు ప్రాజెక్టుకు వస్తున్న నీటితో సమానంగా కుడి ఎడమ కాలువల ద్వారా వానాకాలం పంటలకు సాగునీటి విడుదలను చేస్తున్నారు. కోయిల్‌సాగర్ పూర్తి స్థాయి నీటి మట్టం 32.6 అడుగులు కాగా ప్రస్తుతం 31 అడుగులు నీటిమట్టం ఉంది. అలాగే మిషన్ భగీరథ పథకం కింద తాగునీటి కోసం ప్రాజెక్టు రెండు వైపుల ఉన్న పంప్‌హౌస్‌ల నుంచి నీటిని పంపింగ్ చేస్తున్నారు. దీంతో ప్రాజెక్టు నీటి మట్టం కొద్దికొద్దిగా తగ్గుతోంది.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

గద్వాల క్రైం: కుటుంబ కలహాల వల్ల మహిళ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గద్వాల మండలంలోని జమ్మిచెడ్‌లో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మనవపాడు మండలం వల్లూరు గ్రామానికి చెందిన మరియమ్మ(30)ను కొన్ని సంవత్సరాల క్రితం జమ్మిచెడ్‌కు చెందిన బీసన్నకు ఇచ్చి పెద్దలు పెళ్లి చేశారు. భర్త కొంతకాలంగా మరో మహిళతో సంబంధం పెట్టుకున్నాడు. దీన్ని గమనించిన భార్య భర్తను నిలదీసింది. ఈ విషయంలో భార్యభర్తల మధ్య వివాదం జరిగింది. సాయంత్రం ఇంట్లో ఎవరలేని సమయంలో ఆమె ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన బంధువులు రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ ఆనంద్ ఘటనా స్థలానికి చేరుకొని ఆమె ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీశారు. ఆమెకు ఇద్దరు పిల్లలున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రయాణికుల సందడి


మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

- హైదరాబాద్ రూట్లో కిక్కిరిసిన బస్సులు
- దసరా లక్కీడ్రాకు విశేష స్పందన

స్టేషన్ మహబూబ్‌నగర్: దసరా పండుగ ముగిసిన నేపథ్యంలో ప్రజలు తమ సొంతూళ్ల నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. దీంతో ఆర్టీసీ బస్టాండ్లలో ప్రయాణికుల సందడి పెరిగింది. రెండు రోజుల నుంచి ఆర్టీసీ బస్టాండ్లలో ప్రయాణికుల సంఖ్య క్రమేణ పెరుగుతోంది. బుధవారం ఉదయం, సాయంత్రం వేళల్లో బస్టాండ్లలో ప్రయాణికులు అధిక సంఖ్యలో కనిపించారు. ముఖ్యంగా హైదరాబాద్ రూట్లో ప్రయాణికుల తాకిడి ఎక్కువగా కనిపించింది. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా హైదరాబాద్ రూట్లో ఎక్కువ బస్సులను నడిపిస్తున్నారు. ఈ బస్సులన్నీ ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి.


లక్కీడ్రా బాక్స్‌లను పరిశీలిస్తున్న ఆర్‌ఎం శ్రీదేవి

రీజియన్ పరిధిలో..

దసరా పండుగ నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ సంస్థ లక్కీడ్రా కార్యక్రమం చేపట్టింది. రీజియన్ పరిధిలోని అచ్చంపేట, తెల్కపల్లి, డిండి, గద్వాల, అయిజ, కల్వకుర్తి, ఆమనగల్లు, కొల్లాపూర్, కోస్గి, మహబూబ్‌నగర్, జడ్చర్ల, నాగర్‌కర్నూల్, బిజనేపల్లి, నారాయణపేట, మద్దూర్, మరికల్, మక్తల్, షాద్‌నగర్, షాబాద్, ఆరాంఘర్, వనపర్తి, ఖిల్లాఘనపూర్, పెబ్బేర్, కొత్తకోట బస్టాండ్లలో పురుషులు, మహిళలకు వేర్వేరుగా లక్కీడ్రా బాక్స్‌లు ఏర్పాటు చేశారు. ప్రతి రీజియన్‌లో గెలుపొందిన ఐదుగురు పురుషులు, ఐదుగురు మహిళలకు ఒక్కొక్కరికి రూ.9,900 చొప్పున బహుమతులు అందజేయనున్నారు. దసరా పండుగ లక్కీడ్రాకు ప్రయాణికుల నుంచి విశేష స్పందన లభిస్తున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ వి.శ్రీదేవి తెలిపారు. బుధవారం మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన లక్కీడ్రా బాక్స్‌లను ఆర్‌ఎం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రాఖీ పండుగ మాదిరిగానే దసరా లక్కీడ్రా బాక్స్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. లక్కీడ్రా సౌకర్యం ఈ నెల 30 వరకు ఉంటుందని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బ్రహ్మోత్సవాల పనులు ప్రారంభం


ముస్తాబవుతున్న ఆంజనేయ స్వామి విగ్రహం


కురుమూర్తి స్వామి ప్రధాన ఆలయ శిఖరానికి రంగులు వేస్తున్న సిబ్బంది

చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపురం గ్రామ సమీపంలో వెలసిన కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు వచ్చే నెల 14వ తేదీన ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ అధికారులు పనులు ప్రారంభించారు. ముందుగా కోనేరు శుభ్రం పరిచే పనులు చేపట్టి నీటిని బయటకు తోడేశారు. ఆలయానికి రంగులు వేస్తున్నారు. స్వామివారి ప్రధాన ఆలయ శిఖరం, అమ్మవారి ఆలయం, కొండ దిగువన చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఆంజనేయస్వామి విగ్రహానికి రంగులు అద్దుతున్నారు. వారం రోజుల్లో రంగులు వేసే పనులు పూర్తి చేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

తాగిన మైకంలో భార్యను కడతేర్చిన భర్త

గోపాల్‌పేట: తాగిన మైకంలో కట్టుకున్న భార్యను కడతేర్చాడో ప్రబుద్ధుడు. ఈ ఘటన వనపర్తి జిల్లా రేవల్లి మండలంలోని తల్పునూర్‌లో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు.. తల్పునూర్‌కు చెందిన రాంపేట రాములు, నాగమణి (40) భార్యాభర్తలు. వీరిద్దరూ ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి పనులు చేసుకుని బతికేవారు. దసరా పండుగ నిమిత్తం వారంరోజుల కిందట స్వగ్రామానికి వచ్చారు. వీరికి ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉండగా.. పెద్దకూతురు స్వప్నకు పెళ్లయింది. మరో కూతురు హైదరాబాద్‌లో చదువుకుంటోంది. కుమారుడు సైతం హైదరాబాద్‌లో ఉంటూ పని చేసుకుంటున్నాడు. బుధవారం తాగిన మైకంలో నాగమణితో భర్త రాములు గొడవ పడ్డారు. ఇంట్లో ఏం జరిగిందో తెలియదు కానీ.. సాయంత్రం వరకు అతడు ఇంటి తలుపులను తెరవలేదు. సాయంత్రం 6గంటల ప్రాంతంలో వారి మొదటి కూతురు స్వప్న పిల్లలతో కలిసి ఇంటికి రాగా, చాలాసేపటి తర్వాత తండ్రి తలుపులు తెరిచాడు. ఆమె ఇంట్లోకి వెళ్లి చూస్తే తల్లి రక్తపు మడుగులో కనిపించింది. దీంతో చుట్టుపక్కల వారు వచ్చి చూడగా, అప్పటికే ఆమె మరణించినట్లు గుర్తించారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.

తీవ్ర అస్వస్థతతో బాలుడి మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబసభ్యుల ఆందోళన


బాలుడి మృతదేహం వద్ద రోధిస్తున్న బంధువులు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో బాలుడు మృతిచెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం అచ్చంపేట మండలంలోని బొమ్మనపల్లి గ్రామానికి చెందిన నాగమ్మ, వీరయ్య దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. రెండో సంతానం అయిన మూడు నెలల బాలుడు రెండు రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో మంగళవారం సాయంత్రం అచ్చంపేటలోని లింగాల రోడ్డులో ఉన్న చరిత సాయి చిన్న పిల్లల ఆస్పత్రికి బాలుడిని తీసుకొచ్చారు. వైద్యులు పరీక్షించి వైద్యం అందించారు. అదేరోజు రాత్రి బాలుడు తీవ్ర అస్వస్థతకు గురై బుధవారం తెల్లవారుజామున బాలుడు మృతి చెందాడు. బాలుడి మృతికి వైద్యులేకారణమంటూ కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. విషయం బయటకు తెలియకుండా ఆస్పత్రి యాజమాన్యం జాగ్రత్త పడ్డారు.

ఎదురెదురుగా బైక్‌లు ఢీ: ఒకరి మృతి

మహబూబ్‌నగర్ క్రైం: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ కొని ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన జిల్లా కేంద్రం సమీపంలోని తిరుమల హిల్స్ వద్ద బుధవారం చోటుచేసుకొంది. రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు వివరాల ప్రకారం కేసీఆర్ అర్బన్ ఎకో పార్క్ ఎదుట రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నల్గొండ జిల్లా డోరేపల్లికి చెందిన నర్సింహ(45) అక్కడిక్కడే మృతి చెందాడు. మరో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రంగాపురంలో మరో వ్యక్తి..

పెబ్బేరు రూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని రంగాపురంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ జగదీశ్వర్‌రెడ్డి వివరాల ప్రకారం. పెబ్బేరు మండలం, రంగాపురం గ్రామానికి చెందిన కటికెల బీచుపల్లి (32) మంగళవారం సాయంత్రం బైక్‌పై జనుంపల్లి దారిలో ఉన్న తన వ్యవసాయ పొలం దగ్గరకు వెళ్లాడు. జనుపల్లి వైపు నుంచి ఇంటికి బైక్ పై వేగంగా వస్తూ మలుపు వద్ద అదుపు తప్పి చెట్టుకు ఢీ కొట్టాడు. దీంతో తలకు బలమైన గాయాలై పక్కనున్న కాల్వలో పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అతని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి మృతదేహం ఆచూకీ లభ్యం

పాన్‌గల్: మండలంలోని మల్లాయిపల్లి గ్రామ ఈదుల చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఆచూకీ లభ్యమైనట్లు ఎస్‌ఐ వేణు తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వనపర్తి మండలం చందపూర్‌కి చెందిన మోటపోతుల నర్సింహ (36)గా గుర్తించినట్లు పేర్కొన్నారు. మృతుడు మోటపోతుల నర్సింహ, మల్లాయిపల్లి గ్రామస్తుడు దాసరి భగవంతు, చందాపూర్ గ్రామస్తుడు స్లపయర్ నర్సింహ ఇద్దరు కలిసి బైక్‌పై వచ్చి మిర్చి తినివస్తామని చెప్పి మృతుడు మోటపోతుల నర్సింహ్మను తీసుకవెళ్లారు. మిర్చిలు తినివస్తామని చెప్పి వెళ్లిన వారు రాత్రి వరకు ఇంటికి రాలేదన్నారు. మరుసటి రోజు దాసరి భగవంతు ఒక్కడే వచ్చాడన్నారు. దీంతో మృతుడు మోటపోతుల ఆచూకీ ఎక్కడ లభించలేదు. మంగళవారం గ్రామ సమీపంలోని మల్లాయిపల్లి ఈదుల చెరువులో గుర్తుతెలియని శవం ఉందని తెలియడంతో వెళ్లి చూడగా.. మోటపోతుల నర్సింహగా గుర్తించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. చెరువు నీటిలో వలలో మృతదేహం కనిపించిందన్నారు. మా అన్న మృతిపై, మా అన్నతో పాటు వెళ్లిన వారిపై అనుమానం ఉందని దీనిపై సమగ్ర విచారణ జరిపి తగు న్యాయం చేయాలని మృతుని సోదరుడు మోటపోతుల రామలక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఇయర్ ఫోన్స్ పెట్టుకుని రైల్వేట్రాక్‌పై వాకింగ్

- రైలు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

మక్తల్: ఇయర్ ఫోన్స్ పెట్టుకుని రైల్వేట్రాక్‌పై ఓ యువకుడు వాకింగ్ చేస్తుండగా, రైలు ఢీకొట్టిన ఘటన మక్తల్ రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని ఉప్పర్‌పల్లికి చెందిన నవీన్‌కుమార్‌రెడ్డి ఇయర్ ఫోన్స్ పెట్టుకొని రైల్వేట్రాక్‌పై వాకింగ్ చేస్తూ, గూడ్స్ రైలు రావడాన్ని గమనించలేదు. అతడిని రైలు ఢీకొట్టడంతో ఒకచెయ్యి పూర్తిగా తెగిపడింది. స్థానికులు గమనించి అతడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించినట్లు నవీన్‌కుమార్ రెడ్డి తండ్రి నర్సింహా రెడ్డి తెలిపారు.


గాయపడిన నవీన్‌కుమార్‌రెడ్డి